తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

సోమవారం

21 సెప్టెంబర్ 2026



# అలుగు నీటికి అడ్డంగా బాట

- భారీ వర్షాలపై ప్రజల్లో ఆందోళన
- సాధారణ వర్షానికే ఉధృతంగా ప్రవాహం
- ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ పరిధిలోని పొలాలు మునిగే ప్రమాదం
- ఈదమ్మ ఆలయానికి వెళ్లే సాంప్రదాయ మార్గంపై వివాదం

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లోని మల్లప్పరాజు కుంట అలుగు నీటి ప్రవాహానికి అడ్డంగా బాటను ఎత్తు పెంచడం వల్ల నీటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాత్రి కురిసిన సాధారణ వర్షానికే చెరువు అలుగు నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని వారు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే నీటి ప్రవాహం మరింత పెరిగి, చెరువు కట్టకు నష్టం వాటిల్లడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పొలాలు, రహదారులకు ముంపు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల వివరాల ప్రకారం.. మల్లప్పరాజు కుంట నిండిన సమయంలో అలుగు ద్వారా బయటకు వచ్చే నీరు గతంలో ఒక నిర్దిష్ట మార్గంలో సహజంగా ప్రవహిస్తూ గుండ్ల చెరువుకు, అక్కడి నుంచి చుక్కపల్లి ఊర చెరువుకు చేరేది. దీంతో వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు వెళ్లే పరిస్థితి ఉండేదని వారు తెలిపారు. అయితే ఇటీవల అలుగు ప్రాంతంలో



జేసీబీలతో పనులు చేపట్టి, నీటి ప్రవాహ మార్గానికి అడ్డంగా మట్టి పోసి బాటను ఎత్తు పెంచినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అలుగు వద్ద గతంలో నీటి ప్రవాహానికి అనుకూలంగా ఏర్పాటు చేసిన పైపులను తొలగించి, మరికొన్ని పైపులను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసి వాటిపై మట్టి పోయడంతో నీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు.

**ఈదమ్మ ఆలయానికి వెళ్లే మార్గంపై ఏళ్లుగా వివాదం...**

మల్లప్పరాజు కుంట కింది నుంచి ఈదమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే బాటకు ఏళ్లుగా ప్రత్యేక ప్రాధాన్యత



ఉందని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా ఈదమ్మ సర్కార్ బోనం వెళ్లే ప్రధాన మార్గంగా ఈ బాటను ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. కొల్లాపూర్ పట్టణం నుంచి ఈదమ్మ అమ్మవారికి బయలుదేరే సర్కార్ బోనం ఇదే మార్గం గుండా వెళ్లడం సంప్రదాయంగా కొనసాగుతోందని తెలిపారు.

ఈదమ్మ ఆలయానికి వెళ్లే దారి విషయంలో గతంలో రైతులు, కుల సంఘాలు, పట్టణ ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు.

బాట హద్దులను సూచిస్తూ కడీలు ఏర్పాటు చేసినప్పటికీ



సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు పేర్కొన్నారు. ఒకవైపు ఆలయానికి వెళ్లే సాంప్రదాయ బాట అంశం, మరోవైపు మల్లప్పరాజు కుంట అలుగు నీటి ప్రవాహ మార్గం అంశం పరస్పరం ముడిపడి ఉన్నందున అధికారులు సమగ్రంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.





# ముదిరెడ్డిపల్లిలో వంట ఇటుకల తయారీ పరిశ్రమ ఉందా ?

**రాజాపూర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి):** ముదిరెడ్డి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో బోన్ ప్రోడక్ట్స్ పరిశ్రమ ను ఆనుకొని, ఆర్ సిఎం రెడ్ మిక్స్ పరిశ్రమకు వెళ్ళే దారిలో చూట్టూ పాత రేకు లతో ప్రహారీ ఏర్పాటు చేసి ఒక నిర్మాణం ఉన్నది. అది పరిశ్రమ నా ! లేకా పాత ఇనుప సామాను



సేకరించే దుకణామా అని అనుమానంతో ఆ పాత రేకుల షెడ్ లోకి వెళ్ళగా విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి. టన్నుల కొద్దీ వెరుశనగ పొట్టు, టన్నుల కొద్దీ కలిప గుజ్జుతో తయారు చేసిన ఇటుకల కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఇదంతా తయారు చేయడానికి బీహార్ కూలీలను వాడుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున నడిపిస్తున్న ఈ పరిశ్రమకు పేరు లేదు. మొత్తం ఎండు కలుప గుజ్జు, వెరుశనగ పొట్టు ఉన్నా ఎక్కడా ఫైర్ సేఫ్టీ లేదు. విద్యుత్ హైటెంక్షన్ లైన్ తో ఏర్పాటు చేసిన బోర్డుకు సేఫ్టీ లేదు. ఈ పరిశ్రమ దాదాపు రెండు సంవత్సరాలుగా ఉత్పత్తులను పోలేపల్లి సెజ్ పరిశ్రమలకు బాయిలర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు చిన్న పిల్లలు కూడా పరిశ్రమ లోపల ఉన్నారు. వీపరీతమైన దుమ్ము ధూళి ఉండే ఈ పరిశ్రమలో కార్మికులకు మాస్క్ లు కూడా లేవు. ఈ పరిశ్రమకు ఏ అనుమతులు ఉన్నాయి ? అసలు అనుమతులు ఉన్నాయా లేవా? ఈ పరిశ్రమ పేరేంటి? ఇందులో పనిచేసే కార్మికులకు రక్షణ ఎక్కడా ?

ముదిరెడ్డి పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా అక్కడ పరిశ్రమ ఉన్నదని కూడా నాకు తెలియదు అని సమాచారం ఇచ్చారు.

ఇలాంటి పరిశ్రమలు ముదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న టీఎస్ ఐపాస్ అనుమతులు ఉన్నాయని ప్రభుత్వ ఆదాయానికి గండి కోడుతున్నాయని అనుమానం వ్యక్తం అవుతోంది.

పోలేపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు అనుమతులు ఒక పేరు, తయారు చేసే ఉత్పత్తి వేరే అని వాటిని పరిశీలించే అధికారుల నిర్లక్ష్యంతో పరిశ్రమల యాజ మాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు తెలిపుతున్నారు.

# గురుకులంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలి**

**డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**





**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర పాఠ శాల/కళాశాలను నాగర్ కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులానికి చేరుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ ముందుగా విద్యార్థుల వసతి గృహాలు, తరగతి గదులు, భోజనశాల, వంటగది తదితర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, తాగునీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది, వసతి సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా, విద్యా బోధన ఎలా జరుగుతోంది, ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారా అనే అంశాలపై విద్యార్థులను వివరాలు అడిగారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతిరోజూ భోజన నాణ్యతను సంబంధిత అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు.

# కుచ్చర్ కల్ శివారులో భారిగా ఫిల్టర్ ఇసుక డంప్

**రాజాపూర్, సెప్టెంబర్ 20(జనంసాక్షీ):** మండల పరిధి లోని కుచ్చర్ కల్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దుందుభి వాగు నుండి అక్రమంగా మట్టిని ఫిల్టర్ చేసి బారిగా కుచ్చర్ కల్ గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి లో బారిగా డంప్ చేసి, రాత్రి వేళల్లో అక్కడి నుండి రైతుల పంట పోలాల్లోనుండి టిప్పర్లు తరలించడంతో పంటలు నాశనం అవుతున్నాయని రైతులు కిందకు తీసి కంచే ఏర్పాటు చేశారు. అయినా అక్రమ ఇసుక మాఫియా వ్యక్తి కి కుచ్చర్ కల్ గ్రామానికి చెందిన అధికార పార్టీ

మిగతా 4లో..



# ఉట్కూర్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంపు ప్రారంభం

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మక్తల్ నియోజకవర్గం ఉట్కూర్ మండల కేంద్రంలో బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....**

ఉట్కూర్‌లో ఇంత పెద్ద స్థాయిలో మెగా హెల్త్ క్యాంపును తొలిసారిగా ఏర్పాటు చేసిన బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సేవ చేసే గుణం కొందరికే ఉంటుందని,మనం చేసిన సేవే మనలను కాపాడుతుందని మంత్రి అన్నారు. కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మెగా హెల్త్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ సందర్భంగా పేద పిల్లలకు డిజిటల్ పలకలు, రోగులకు మందులు, దుప్పట్లు పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఉట్కూర్ గ్రామ సర్పంచ్ రేణుక, బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాల కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా వేరుశనగ విత్తనాల పంపిణీ



**కల్వకుర్తి,సెప్టెంబర్ 20(జనంసాక్షి):** రైతులకు వేరుశనగ విత్తనాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిసోమవారం స్వయంగా పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో 11:30గంటలకు కల్వకుర్తి పట్టణంలోని రైతు వేదికలో విత్తనాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతులమీదుగా రైతులకు వేరుశనగ విత్తనాలు అందజేయనున్నారు. సంబంధిత మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కోహెడ అభివృద్ధికి సహకరించండి



**కోహెడ, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కోహెడ మండలంలోని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ ఆధ్వర్యంలో ధర్మ సాగర్‌పల్లి ముదిరాజ్ సంఘం నాయకులు కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ దేవాలయ అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు. ఇప్పటికే కోహెడ మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు అందించామని, భవిష్యత్‌లోనూ సహకరిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా నాయకులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఉప సర్పంచ్ రాజబాబు ఆర్థిక సాయం



**చేర్యాల, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** పోతిరెడ్డిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాన్ని గర్నపల్లి ఎల్లం అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబానికి పోతిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ పోలోజు రాజబాబు ఆదివారం పరామర్శించారు.

ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి మానవత్వంతో స్పందించి, తక్షణ ఆసరాగా ఇంటికి అవసరమైన సామాగ్రి అందజేసి రానున్న రోజుల్లో కుటుంబానికి అండగా ఉంటానని మాట ఇచ్చారు. నిరుపేద కుటుంబానికి విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచిన రాజబాబుకి గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు బోకురి నరసింహారెడ్డి, శ్రీలత వినోద్ కుమార్, లింగంపల్లి సురేష్ కుమార్ లతో పాటు స్థానిక నాయకులు గర్నపల్లి చంద్రం, దుబ్బాక నర్సింహులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గురువుల సేవలకు ఘన గౌరవం





**కోహీర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కోహీర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులు, ప్రాథమిక ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీఆర్‌పీ విభాగాల్లో అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారు దేశాభివృద్ధికి మూలస్తంభాలని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలు ఇదే స్ఫూర్తితో విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కొలువుల లక్ష్యంగా యువత పరుగులు



**వనపర్తి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా మార్గనిర్దేశం చేయాలనే లక్ష్యంతో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి. మధుకర్ స్వామి ఆధ్వర్యంలో వనపర్తి రేడియంట్ హైస్కూల్, తిరుమల హిల్స్ ఆవరణలో నిర్వహించిన పరీక్షకు సుమారు 400 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అవగాహన, ప్రోత్సాహం కల్పించేందుకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దమందడి ఎస్ఐ జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, సమయపాలనతో నిరంతరం కష్టపడాలని సూచించారు.

కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, డా. గద్దె ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సహకరించారు. గ్రామీణ యువతకు పోటీ పరీక్షలపై మార్గదర్శకత్వం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని గద్దె భాస్కర్ తెలిపారు.

## బిలాల్‌పూర్ పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం





**కోహీర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కోహీర్ మండలం బిలాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కే. సురేష్ ప్రత్యేక ఆహ్వాన పత్రికలు అందించి, ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అధికసంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన విద్యా కార్యక్రమాలను తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థుల చదువు, హాజరుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల-తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సుచరిత, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ మోహన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధిలో రాణించాలి



**తూప్రాన్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** స్వయం ఉపాధి ద్వారా యువత అభివృద్ధి సాధించాలని బిఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్ సింగ్ అన్నారు. తుపాకులపల్లి గ్రామంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన పాలకేంద్రంను ఉప సర్పంచ్ మహేష్ యాదవ్ తో కలిసి ప్రారంభించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా వ్యాపారం ప్రారంభించి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, యువత పాల్గొన్నారు.

## తెలంగాణకు 2 లక్షల ఇళ్ల మంజూరుపై బీజేపీ నేత హర్షం



**తాడూరు, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY) కింద తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరు చేయడంపై తాడూరు మండల బీజేపీ అధ్యక్షుడు చీల సుదర్శన్ హర్షం వ్యక్తం చేశారు. నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తోందన్నారు. తెలంగాణకు తాజాగా 2 లక్షల ఇళ్లు మంజూరు కావడం పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు.

అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా సొంత ఇళు నిర్మించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇళ్లు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.

## కొమిరెడ్డిపల్లిలో పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

**గండీడ్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):**

గండీడ్ మండలం కొమిరెడ్డిపల్లిలో పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ నిర్వహించారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోయిని గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామస్తులు, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విగ్రహ దాత టైగర్ రవీందర్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు అభినందించారు. భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని, ముదిరాజ్ సంఘం ఐక్యంగా సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# పత్తికి రూ.15 వేలు, వరికి రూ.3,500 మద్దతు ధర ఇవ్వాలి

- **అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్**



**మక్తల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ, అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఐ.బి. గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు భగవంతు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి.చంద్రశేఖర్, టి.యు.సి.ఐ. జిల్లా అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న పత్తి, వరి పంటలకు సరైన ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాటన్ మిల్లులకు పత్తిని తీసుకెళ్తే మధ్య దళారులు కుమ్మక్కై, తేమ శాతం పేరుతో రోజుకో ధర తగ్గిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మొదట క్వింటాల్‌కు రూ.9,600 ఇస్తున్నామని చెప్పి, మరుసటి రోజు రూ.9,400కి తగ్గిస్తున్నారని, దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు.

?వాతావరణ మార్పులతఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నాయకులు తెలిపారు. రోహిణి, మృగశిర కార్తెలలో వేసిన విత్తనాలు వర్షాలు లేక మొలకెత్తలేదని, ఆరుద్ర కార్తెలో ఎండ తీవ్రతకు మొక్కలు సరిగా పెరగలేదని పేర్కొన్నారు. ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు అన్నీ కలుపుకొని ఎకరాకు రూ.30,000 వరకు పెట్టుబడి అయిందని తెలిపారు. ఒకప్పుడు ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు పండే పత్తి, ప్రస్తుతం సరైన వర్షాలు లేక కేవలం 2 క్వింటాళ్లు కూడా పండే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో

అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి ఆనంద్, టి.యు.సి.ఐ. జిల్లా ఉపాధ్యక్షులు భుట్టో, రైతు సంఘం ఏరియా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాజు, వెంకటేష్, మల్లేష్, గోపాల్, నర్సింలు, రాఘవరెడ్డి, చెన్నప్ప, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సంగమణికి పురస్కారం



**కోహీర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కోహీర్ మండలంలోని చింతల్‌ఘట్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు సంగమణి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్నారు. శనివారం కోహీర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమెకు ఈ అవార్డును అందజేశారు.

మండల విద్యాధికారి మహమ్మద్ జాకీర్ హుస్సేన్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి వివిధ విభాగాల్లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చింతల్‌ఘట్ గ్రామానికి చెందిన సంగమణిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించి బహుమతి అందజేశారు.

అలాగే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల విభాగంలో గొడిగార్‌పల్లికి చెందిన ఆర్. శ్రీనివాస్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల విభాగాల్లోనూ పలువురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుల విభాగంలో ఎం. సురేఖ, మండల స్థాయి సీఆర్పీగా ఎం. యాదయ్య పురస్కారాలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎంఈఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి అంకిత భావంతో నిరంతరం కృషిచేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించడమే అవార్డుల ప్రధాన ఉద్దేశమన్నారు. ఉపాధ్యాయులు తమ గురుతర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే విద్యార్థుల్లో మంచి మార్పు తీసుకురావడంతో పాటు సమాజం పురోగతి సాధిస్తుందని తెలిపారు. దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల బోధన, మార్గనిర్దేశం కీలకమని, ఉపాధ్యాయులే దేశ ప్రగతికి మూలస్తంభాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆకుల ప్రభు, ఆర్. శారద, శ్రీనివాస్, షబానా బేగం తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ సీహెచ్ విఠల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అవార్డు గ్రహీతలను అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - సర్పంచ్ కొండల్ యాదవ్



**వెల్దండ, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన ముంత శ్రీను మృతి చెందడంతో ఆయన కుటుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును పోతేపల్లి గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి తగుళ్ల కొండలు యాదవ్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక భరోసా అందేలా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, యువ నాయకులు ముంత మల్లేష్, ఉడుత శివ, చిన్న సైదయ్య, ఎగిరిశెట్టి శివ, ఉడుత బాలు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్యకు ఘన వీడ్కోలు... భక్తిశ్రద్ధలతో శోభయాత్ర

- **శోభయాత్రను ప్రారంభించిన ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్**
- **మహిళలు కోలాటాలు, నృత్యాలతో సందడి**

**కొల్చారం, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):**
మండల కేంద్రం కొల్చారంలో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా శ్రీ హనుమాన్ వినాయక మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యకు ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం గణనాథుడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

**ఆకట్టుకున్న శోభాయాత్ర...**

శ్రీ హనుమాన్ కాలనీ వాసులు గణపయ్యకు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. మహిళలు, యువత కోలాటాలు, నృత్యాలతో సందడి చేయగా, యువకులు డీజే పాటలతో ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తుల భజనలు, గణపతి నామస్మరణలతో కొల్చారం వీధులు మార్మోగాయి.

**"మళ్లీ రావయ్య గణపయ్య.."**

"మళ్లీ రావయ్య గణపయ్య.. మా గండాలు తొలగించి, మా కోరికలు తీర్చావయ్య గణపయ్య" అంటూ భక్తులు గణనాథుడిని స్మరిస్తూ భావోద్వేగంతో వీడ్కోలు పలికారు.

శోభాయాత్ర సందర్భంగా కొల్చారంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, పాంద్ర వెంకటేశం, తిమ్మనగారి ఆంజనేయులు, వనమాల అనిల్ శ్రీధర్ , మనోహర్, అఖిల్, రితిన్, సత్యనారాయణ, తెనుగు శేఖర్, రామా గౌడ్, శేఖర్, సారా రామకృష్ణ, నరసింహులు, వడ్ల శివ, సుదర్శన్, దుర్గాప్రసాద్ గౌడ్, చెన్నయ్య, ఆనంద్, పాంద్ర శ్రీనివాస్, శ్రీశైలం, నాగరాజ్, శేఖర్, సత్యనారాయణ ముత్యం శ్రీనివాస్ .లక్ష్మీనారాయణ, రాజు, వంశీ, సంపత్, శివ, లంబాడి శ్రీనివాస్, ప్రవీణ్, రామ్, కుమ్మరి నాగరాజ్, సంజీవులు, వినాయక కమిటీ బృందం భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# రోడ్డు పనుల! ఊసే లేదు

**ఇబ్బందులు ఇరు గ్రామాల ప్రజలు • రోడ్డు కై.. మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర**





**నిజాంపేట, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** రోడ్డు సౌకర్యం సరిగా లేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 7 కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా కంకర పోసి వదిలేయడంతో రవాణా సాగించడం అణువుగా లేకపోవడంతో గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట మండలం చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ గ్రామం వరకు 7 కిలోమీటర్లు రోడ్డును అదరబాదరగా పాత తారు తీసేసి, కంకర పోసి వదిలేశారు. నిత్యం ఈ రోడ్డు గుండా ఇరువు గ్రామాల ప్రజలు నిజాంపేట, రామాయంపేట వివిధ పట్టణాలకు అవసరాలు నిమిత్తం వెళ్తూ.. ఉంటారు. ఈ రోడ్డు అద్వానంగా ఉండడంతో గ్రామానికి బస్సు సౌకర్యం సైతం.. నిలిచిపోయింది. దీంతో ఇరు గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యానికి కూడా నోచుకోలేని దుస్థితిలో ఉన్నామని అంటున్నారు. అయితే ఈ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నందగోకుల్ నుండి చల్మెడ కమాన్ వరకు ఏడు కిలో మీటర్లు ప్రజలతో కలసి పాదయాత్ర చేపట్టారు. వెంటనే ఈ రోడ్డుపై తారువేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని, లేదంటే రానున్న రోజుల్లో మరిన్ని నిరసన కార్యక్ర మాలు చేపడుతామన్నారు. ఇన్ని జరిగినప్ప టికీ ఈ రోడ్డు పనుల ఊసే లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలీ వేడుకుంటున్నారు.

# వైభవంగా బసవేశ్వర పల్లకి సేవా



**నారాయణపేట, సెప్టెంబర్ 20(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ సరాఫ్ బజార్లో కొలువైన బసవేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వ హించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మ కర్త బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చకులు మడపతి మంజునాథ స్వామి, రాజు స్వామి,మణి స్వామి ఆల యంలోని మూలవిరాట్కు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం బసవేశ్వ రుడు, వీరభద్ర స్వామి ఉత్సవ విగ్రహాలతో పట్టణ పురవీధులగుండా లింగయ్యగుడి వరకు పల్లకీ సేవ కనుల పండువగా నిర్వహించారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ బాలింగం, ముర్లపల్లి జగదీష్, సంగన్ బసప్ప, సిద్ధి లింగయ్య స్వామి,జాజాపూర్ మణి కంఠ,రవి,పవిత్ర,సునీత,శైలు, మాధు, పార్వతి, మహిళలు, వీరశైవ సమా జం సభ్యులు పాల్గొన్నారు.

### బీరంగూడ మల్లన్న

# సన్నిధిలో సినీ, టీవీ తారల సందడి



**అమీన్పూర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** బీరంగూడ గుట్టపై కొలువుదీరిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం సినీ, టీవీ రంగానికి చెందిన ప్రముఖులు సందడి చేశారు. ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కుమారుడు, యువ హీరో ఆకాష్ పూరితో పాటు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' షో ఫేమ్ సిద్దు, సోనియా ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న సినీ, టీవీ తారలకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి విశేష అభిషేకాలు, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపిన వారు స్వామివారి ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ఈవో దేవనాదం, ఆలయ చైర్మన్ సుధాకర్ సినీ, టీవీ తారలను ఘనంగా సన్మానించారు. స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆకాష్ పూరి, సిద్దు, సోనియా మాట్లాడుతూ బీరంగూడ మల్లన్నను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయంలోని ప్రశాంతమైన వాతావరణం, స్వామివారి దర్శనం తమకు ఎంతో మానసిక ప్రశాంతతను కలిగించిందని పేర్కొన్నారు.

# అన్నదాన కార్యక్రమానికి పద్మ దేవేందర్ రెడ్డి





**మెదక్ టౌన్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో శ్రీ ఛత్రపతి శివాజీ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి హాజరై భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండలి సభ్యులను ఆమె అభినందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్లు ఆంజనేయులు, స్వరూప, నాయకులు జీవన్ రావు, మాయ మల్లేశం, సాయి కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మహాగణపతి పూజలు



**వనపర్తి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన మహాగణపతి మండపంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి.మాధవరావు సింధే, ఆయన కుమార్తె ప్రణతి సింధేలను శాలువాలతో సన్మానించి, వేద పండితుల ఆశీర్వచనాలు అందించారు. గొల్ల, కుర్వ, యాదవ, ఆర్యవైశ్య తదితర సంఘాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పూజల్లో పాల్గొన్నారు.
విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని కూడా సన్మానించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాగణపతి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

# కుచ్చర్ కల్ శివారులో భారిగా ఫిల్టర్ ఇసుక డంప్





అయినా అక్రమ ఇసుక మాఫియా వ్యక్తి కి కుచ్చర్ కల్ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుని అండదండలు ఉండటంతో ఒక వెంచర్ రోడ్డును అక్రమ ఇసుక లారీలు వెల్లడానికే లీజుకు మాట్లాడి ఉపయోగిస్తున్నారు. ఉదయం గేటుకు తాళాలు వేస్తారు. రాత్రి వేళల్లో తాళం తీస్తారు. కానీ ఇదంతా రెవెన్యూ, పోలీసుశాఖకు కనిపించదు.

# మున్నూరు రవీందర్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు జిల్లా కోర్ కమిటీ వినతి



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్20 (జనంసాక్షి):** రాబోయే మెదక్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది మున్నూరు రవీందర్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా కోర్ కమిటీ సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ శాసనమండలి సభ్యుడు ఎన్. రామచంద్రరావుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. రెండు పర్యాయాలు వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 1994లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ విస్తరణ కోసం పనిచేస్తున్న సమయంలో నక్సలైట్ల దాడికి గురైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తన సుదీర్ఘ రాజకీయ సేవలను, పార్టీ కోసం చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, ఆర్. వెంకటేశ్వర్‌రెడ్డి, కేతూరి బుడ్డన్న, న్యాయవాది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం ముందు వర్షపు నీరు.. కాలనీవాసులకు అవస్థలు



**తెలకపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని శివాలయం ముందు వర్షపు నీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీఆర్ఎస్ నాయకులు రెడ్డపాకుల శివకుమార్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో శివాలయానికి వచ్చే భక్తులు, స్థానికులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు రోజుల తరబడి నిలిచి ఉండటంతో దుర్వాసన, దోమల బెడద పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు.
ఆదివారం ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రెడ్డపాకుల శివశంకర్, అతినారపు కిరణ్ కుమార్ సమస్యను పరిశీలించి అధికారులను నిలదీశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, వర్షపు నీరు నిలిచిపోకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వారు కోరారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

# మక్తల్ మండల నూతన ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) ఏకగ్రీవ ఎన్నిక

- **అధ్యక్షుడిగా మామిళ్ల పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా రాజు పెయింటర్**
- **అభినందించిన సలహాదారులు అంజన్ ప్రసాద్, దేవసూగురు సురేందర్, బాల్ రాజ్**





**మక్తల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మక్తల్ మండల నూతన ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) కమిటీని ఆదివారం సీనియర్ జర్నలిస్టులు, సలహాదారులు అంజన్ ప్రసాద్ (దిశ), దేవసూగూరు సురేందర్ (ఆంధ్రజ్యోతి), మద్వార్ బాల్‌రాజ్ (సాక్షి) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) అధ్యక్షులు గా మామిళ్ళ పృథ్వీరాజ్ (సత్యవార్త పత్రిక), ప్రధాన కార్యదర్శిగా రాజు పెయింటర్ (తెలుగు ప్రభ), గౌరవ అధ్యక్షులుగా ఎల్లారెడ్డి (వెలుగు) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సురేష్ గౌడ్(మన తెలంగాణ), రఘు (వార్త) కోశాధికారిగా గోవింద్ (సూర్య), కార్యదర్శులుగా ప్రదీప్ కుమార్ (జనం సాక్షి), సి. సురేష్( ప్రజా పక్షం), కర్ని బాల్ రాజ్ (నవ తెలంగాణ), హరిక్రిష్ణ (విజన్ ఆంధ్ర) ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యులుగా నూర్ పాషా(నినాదం), కార్తీక్ (ప్రజా దర్బార్), వెంకట్ రెడ్డి (ప్రజా లక్ష్యం)లను ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన ఐక్యత కోసం నూతన కమిటీ కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు. ఎన్నికైన అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# లక్ష్మీనగర్‌లో పర్యావరణహిత గణేశ్ ఉత్సవాలు



**మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** ప్లాస్టిక్ రహిత సమాజం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా లక్ష్మీనగర్ కాలనీలో వినూత్న కార్యక్రమం చేపట్టారు. కాలనీ సభ్యుడు సొన్నతి వెంకటేశ్వర్లు గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్లాస్టిక్, పేపర్ ప్లేట్ల వినియోగాన్ని నివారించేందుకు 100 స్టీల్ ప్లేట్లు, 30 గ్లాసులు, 2 జగ్గులను ఉత్సవ కమిటీకి విరాళంగా అందజేశారు. ప్రసాద వితరణలో వీటిని వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషిని కాలనీ ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ కార్యక్ర మాల్లో ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ పాత్రలనే వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 51 రకాల ఫలాలతో వినాయకునికి మహాప్రసాదం



**జడ్చర్ల, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లిలో శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం బాదేపల్లిలోని ఏజీ ట్రేడర్స్ వద్ద ప్రతిష్ఠించిన శ్రీ వినాయక స్వామివారికి నిర్వాహకులు 51 రకాల ఫలాలతో ప్రత్యేక మహాప్రసా దాన్ని సమర్పించారు. స్వామివారికి ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, మహాప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. స్వామివారిని దర్శించు కునేందుకు వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు అమర్, దేవరాజ్, గోవర్ధన్, నవీన్, సతీష్, మహేష్, వెంకటేష్‌తో పాటు స్థానిక భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# మనస్తాపంతో మల్లంపేట శివారులో



**పాపన్నపేట, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట ఠాణా పరిధిలో ఆదివారం వెలుగు లోకి వచ్చింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. మల్లంపేట గ్రామానికి చెందిన కోరబోయిన సాయిలు (41) చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజు లుగా పని చేయకుండా ఖాళీగా ఉండడంతో చిన్నపాటి అప్పులు అయ్యాయి. క్షణికావేశంలో గ్రామ శివారులో ఉన్న నర్సాద్రి కుంట సమీపంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

# అట్టహాసంగా గణేష్ నవరాత్రులు

- **అలరిస్తున్న ప్రత్యేక గణనాథులు**
- **ఆకట్టుకుంటున్న హిమ వినాయకుడు**
- **పసుపు కొమ్ముల గణనాథుడు**





**జడ్చర్ల, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** పట్టణంలో వినాయక నవ రాత్రోత్సవాలు అట్టహాసంగా, శోభాయమానంగా సాగుతున్నాయి. పట్టణంలోని వివిధ మండపాలలో గణనాథులు కొలువై భక్తులచే విశేష పూజలందుకుంటున్నారు.

# విద్యార్థులను బెదిరించి నిజాలను దాచలేరు

- భరత్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం
- అధ్యాపకులపై బదిలీ కాదు.. సస్పెన్షన్‌తో సమగ్ర విచారణ చేపట్టాలి
- బిఆర్ఎస్వీ జిల్లా సమన్వయకర్త అతినారపు విష్ణు సాగర్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థి కాలూరి భరత్ యాదవ్ మృతి ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా సమన్వయకర్త అతినారపు విష్ణు సాగర్ డిమాండ్ చేశారు. భరత్ మృతి ఘటనకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులను కేవలం బదిలీ చేయడం కాకుండా సస్పెండ్ చేసి, విచారణ పూర్తయ్యే వరకు విధులకు దూరంగా ఉంచాలని ఆయన కోరారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో ఆయన మాట్లాడుతూ భరత్ మృతి ఘటనపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్న అనుమానాలు, కళాశాలలో నెలకొన్న పరిస్థితులు, అధ్యాపకులపై వస్తున్న ఆరోపణలు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలన్నింటినీ అధికారులు లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి రావాలంటే విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ వాంగ్మూలాలు ఇచ్చే వాతావరణాన్ని అధికారులు కల్పించాలని కోరారు.

## ఈదురు గాలులు, వర్షంతో నేల వారిన చెరకు పంట





**నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి...**

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మండలంలోని గంగ్వార్ గ్రామంలో శని వారం మధ్యాహ్నం కురిసిన ఈదురు గాలులతో కురిసిన మోస్తారు వర్షంతో ఓ రైతు సాగు చేసిన చెరకు పంటకు అధికంగా నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్ రెడ్డి దాదాపు నాలుగు ఎకరాల్లో రూ:3.60లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. సంబంధిత వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి ఆదుకోవాలని కోరారు. అకాల వర్షం, భారీ ఈదురు గాలులతో కురిసిన మోస్తారు వర్షంతో నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు గంగువార్ మల్లేష్ ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి డిమాండ్ చేశారు. రూ: వేలు, లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పలు పంటలు ఈ పాటికే ఆశ జనజంగా ఉన్నాయని, తీవ్ర వర్షాభావంతో రైతులు అల్లాడిపోతున్నారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో దెబ్బతిన చెరకు రైతులను ఆదుకోవాలి కోరారు.

### జాతీయ మాల మహానాడు

# ఆధ్వర్యంలో దొమ్మాట గ్రామ కమిటీని ఎన్నిక

- దొమ్మాట గ్రామ కమిటీ అధ్యక్షులు తాండ్ర నర్సింలు



**చేర్యాల, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** చేర్యాల మండలంలోని దొమ్మాట జాతీయ మాల మహానాడు గ్రామ కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దొమ్మాట గ్రామ కమిటీ గౌరవాధ్యక్షులుగా తాండ్ర సత్తయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు తాండ్ర నర్సింలు, ఉపాధ్యక్షులు గుజక కనకయ్య , తాండ్ర ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి తాండ్ర వెంకటేష్, కోశాధికారి తాండ్ర కనకయ్య , సోషల్ మీడియా తాండ్ర సాగర్, తాండ్ర చందు, సాదుల రాకేష్ , ముఖ్య సాలహాదాతలు తాండ్ర ఆంజనేయులు , సలహాదారులు తాండ్ర చంద్రయ్య , వంగపల్లి నరసయ్య, సమాధుల బిక్షపతి, తాండ్ర పరమేశ్వర్ , తాండ్ర సంపత్ , తాండ్ర వెంకటేష్ , తాండ్ర బాలరాజు, తాండ్రరాజు, ఈ కమిటీ మా మాలలకు జరుగుతున్న అన్యాయంపై, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా స్కేటింగ్ పోటీల్లో బాలికల ప్రతిభ



**మక్తల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీ వేలోడ్రం స్కేటింగ్ అకాడమీలో 19, 20 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ ట్రాక్ స్కేటింగ్ 500 మీటర్ల పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికలు సత్తా చాటారు. నారాయణపేట జిల్లా స్కేటింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో 26 మంది బాలికలు పాల్గొని పలు పతకాలు సాధించారు.

పోటీల అనంతరం ఇండియా కోచ్ డాక్టర్ మాక్స్వెల్, బి.గోపాలం విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు అవంతి, త్రివేణి, తల్లిదండ్రులు సుధ, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు చినుకులకే చిత్తడి చిత్తడి



**గద్వాల, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** స్వల్ప వర్షానికే గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ రాయచూర్ ప్రధాన రహదారి అధ్వానంగా మారుతోంది. కురిసిన తేలికపాటి వర్షానికే రోడ్డుపై భారీగా నీరు నిలిచి చెరువులను తలపిస్తోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీనివల్ల కాలనీ ప్రజలు, వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వర్షాలు పడినప్పుడు అధికారులు వచ్చి తాత్కాలికంగా కొన్ని చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారే తప్ప, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, మున్సిపల్ అధికారులు స్పందించి, ఇక్కడి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

### జావెలిన్ త్రోలో

## ముస్త్యాల విద్యార్థికి జిల్లా ప్రథమ స్థానం



**చేర్యాల, సెప్టెంబర్ 20(జనంసాక్షి):** ముస్త్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చేర్యాల పట్టణానికి చెందిన వెలుగల కరుణాకర్ సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్/ యూత్/ సీనియర్/ జావెలిన్/ క్రాస్ కంట్రీ, ఎన్ఐడి జెఎం అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 2026లో పాల్గొని జావెలిన్ త్రోలో జిల్లా మొదటి స్థానం సంపాదించిన మొదటి స్థానం సాధించాడు. ఈ సందర్భంగా మండలానికి చెందిన మాజీ మంత్రి తనయుడు, కాంగ్రెస్ నేత నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ గుప్త, 5వ వార్డు కౌన్సిలర్ వెలుగల దుర్గయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందనలు తెలిపారు.

## పెద్ద శంకరంపేటకు చేరుకున్న 'రాగా ఫర్ రైస్ ఆఫ్ ఇండియా' పాదయాత్ర



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది కాటూరి వెంకటేశ్వర్లు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన 'రాగా ఫర్ రైస్ ఆఫ్ ఇండియా' పాదయాత్ర ఆదివారం పెద్ద శంకరంపేటకు చేరుకుంది. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో యాత్ర చేపట్టినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్ద శంకరంపేటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్ల గౌడ్, సర్పంచులు కుమార్, వెంకట్రావు, నాయకులు మురళి, పంతులు, దాచా సంఘమేశ్వర్, రవి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

**చిలప్‌చేడ్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** తొమ్మిదవ జాతీయ పోషణ మాసం సందర్భంగా శనివారం చిలప్‌చేడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సోమక్కపేట, గౌతాపూర్, చండూర్, చిట్కుల్, ఫైజాబాద్ హైస్కూళ్లలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఎంపిక చేసి, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఉత్తమంగా ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేసిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చిన్న వయస్సు నుంచే అలవర్చుకోవాలని సూచించారు.




కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెస్త దుర్గాచలం, తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై నర్సింలు, స్కూల్ చైర్మన్, పంచాయతీ కార్యదర్శి మోహన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని అన్ని హైస్కూళ్లలో అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులకు పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

## ఆదర్శంగా నిలవాలి...

- నిర్వాహకులే .. విజేతలు



**పాపన్నపేట, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** పండుగలు ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలి తప్ప కుటుంబ సభ్యులకు విషాదాన్ని మిగల్చకూడదని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో హనుమాన్ బాల గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాయంత్రం వరకు జరిగిన ఈ క్రికెట్ పోటీలో నిర్వాహక జట్టు విజేతగా నిలిచింది.